కాలుష్య కాసారంగా మంజీరా

- కెమికల్ నీటిని వదులుతున్న పరిశ్రమలు
- ఇబ్బందులు పడుతున్న రైతులు, మత్స్యకారులు, పశువుల కాపరులు
- రంగు మారుతున్న వ్యవసాయ భూములు

చండూర్ శివారులో మంజీరా నదిలో కెమికల్ నీరు

చాముండేశ్వరీ ఆలయం వద్ద రంగు మారిన నీరు

కెమికల్ నీటిలో చేపలు పడుతున్న మత్స్యకారుడు

చిలిపిచెడ్, డిసెంబర్ 29: నాడు మంజీరా రైతులు, మత్స్యకారులు, పశువులు, జీవాలు, అడవి ప్రాంతాల ప్రజలకు తాగునీరందించేది. ప్రస్తుతం పరిశ్రమలు వదిలే కెమికల్ నీటితో కాలుష్య కాసారంగా మారింది. ఆ నీటిని తాగుతున్న ప్రజలు, పశువులు అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. చేపలు పట్టేందుకు నీటిలో దిగుతున్న మత్స్యకారులు చర్మ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు.

కెమికల్ నీటితో అనారోగ్య సమస్యలు

మండలంలోని మంజీరా నది పరీవాహక ప్రాంతాలు చిలిపిచెడ్, గంగారం, అజ్జమర్రి, బండపోతుగల్, ఫైజాబాద్, చండూర్, చిట్కుల్ గ్రామాల రైతులు, మత్స్యకారులు నదిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. రైతులు మంజీరా నదిపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారు. నదిలో మోటర్లు పెట్టి సాగుకు నీటిని ఉపయోగించుకుంటున్నారు. ఈ నీటిని భూములకు పారిస్తుంటే నేల రంగు మారుతున్నది. ఎప్పుడైనా మోటర్లకు మరమ్మతులు వస్తే, సరి చేసేందుకు నది నీటిలో దిగిన రైతులకు దురదతో కాళ్లలు, చేతులకు పుండ్లు పడుతున్నాయి. మత్స్యకారులు చేపల వేటకు పోయి ఇలాంటి దుస్థితినే ఎదుర్కొంటున్నారు. చిట్కుల్ గ్రామ శివారులోని చాముండేశ్వరీ ఆలయానికి వచ్చే భక్తులు నదిలో స్నానాలు ఆచరించినప్పుడు ఇలాంటి పరిస్థితే ఏర్పడుతున్నది. దీంతో ఇప్పుడు భక్తులు నదిలో స్నానాలు ఆచరించడం లేదు. తెల్లటి నీటితో మంజీరా నది స్వచ్ఛంగా ఉండేది. ఇప్పుడు కెమికల్ నీటితో కనబడుతున్నది.

కెమికల్ నీటిపై చర్యలు తీసుకోవాలి

కెమికల్ నీటిని మంజీరా నదిలో కలిపి కలుష్యం చేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు, మత్స్యకారులు కోరుతున్నారు. నదిలోని కలుషిత నీటితో భూముల రంగు మారుతున్నదని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని, కెమికల్ నీరు నదిలో కలువకుండా చూడలంటున్నారు.

కెమికల్ నీటితో ఇబ్బందులు పడుతున్నాం

మంజీరా నది నీటితో వ్యవసాయం చేసుకుంటున్నాం. పశువులు, జీవాలు ఈ నీటినే తాగున్నాయి. నక్క వాగు నుంచి వచ్చే కెమికల్ నీటిని పశువులు కూడా తాగడం లేదు. నదిలో బోరుమోటర్ మరమ్మతులకు దిగితే కాళ్లు, చేతులు, శరీరం మొత్తం దురదతో అనారోగ్యానికి గురవుతున్నాం. అధికారులు స్పందించి నక్క వాగు నుంచి వచ్చే కెమికల్ నీటిని మంజీరాలో కలువకుండా చర్యలు తీసుకోవాలి. **- లక్ష్మీకాంతం, రైతు, చండూర్**

నిజాంపేటలో కబ్జాకు గురైన కంటయ్య కుంట

కబ్జా కోరల్లో కంటయ్య కుంట

నిజాంపేట, డిసెంబర్ 29: నిజాంపేటలోని కంటయ్య కుంట కబ్జాకు గురైంది. కుంటను ఆనుకుని వ్యవసాయ భూమి ఉన్న రైతు యథేచ్ఛగా కుంటను ఆక్రమించుకున్నాడని సమీప రైతులు ఆరోపిస్తున్నారు. సుమారుగా 7.14 ఎకరాల మేర విస్తీర్ణం గల కంటయ్య కుంట నేడు కనీసం 2 ఎకరాల మేర కూడ లేదని చెబుతున్నారు. కుంటను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని సదరు రైతులు అధికారులను కోరుతున్నారు.

గౌడిచర్ల హరికృష్ణ శర్మకు గౌరవ డాక్టరేట్

డాక్టరేట్‌ను అందుకుంటున్న గౌడిచర్ల హరికృష్ణ శర్మ

నర్సాపూర్, డిసెంబర్ 29: నర్సాపూర్‌కు చెందిన గౌడిచర్ల హరికృష్ణ శర్మకు గౌరవ డాక్టరేట్‌ను ఏషియన్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ యూఏఎస్ చైర్మన్ డాక్టర్ రమేశ్ అందజేశారు. ముషీరాబాద్ సిటీ కల్చర్ ఆడిటోరియంలో ఏషియన్ కల్చరల్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ (యూఎస్ఏ), స్ఫూర్తి వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అకాడమీ ఆధ్వర్యంలో హరికృష్ణ శర్మను శనివారం సత్కరించారు. ఆధునిక జ్యోతిష్య శాస్త్ర విద్య, వేద గణితంలో ఆయన చేస్తున్న సేవలను గుర్తించి గౌరవ డాక్టరేట్ ఇచ్చినట్లు డాక్టర్ రమేశ్ తెలిపారు.

మెదక్ చర్చిలో భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు

సందేశం వినిపిస్తున్న పాస్టర్.. ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు

నిత్యావసర సరుకులు అందజేస్తున్న చార్లెస్ వాకర్ కుటుంబ సభ్యులు

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 29: క్రిస్మస్ అనంతరం మెదక్ చర్చిలో ఆదివారం భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు కొనసాగాయి. చర్చి ప్రెసిబేటరీ ఇన్‌చార్జి రెవరెండ్ శాంతయ్య భక్తులనుద్దేశించి దైవ సందేశం వినిపించారు. ఏస య్య భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి. పాస్టర్లు డేవిడ్ రిచర్డ్స్, జైపాల్, శ్రీనివాస్ భక్తులను ఆశీర్వదించారు.

130 పేద కుటుంబాలకు నిత్యావసరాల పంపిణీ

చర్చిలో విధులు నిర్వహించే 130 పేద కుటుంబాలకు చర్చి నిర్మాణ దాత చార్లెస్ వాకర్ పాస్నెట్ ఆదివారం నిత్యావసర సరుకులు అందజేశారు. మెదక్ చర్చి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దాతల సహాయంతో కుటుంబ సభ్యులు, మనవళ్లు పంపిణీ చేసినట్లు గ్రోస్ సంస్థ కార్యదర్శి జాయిమూర్రె తెలిపారు. కార్యక్రమంలో చర్చి కమిటీ కార్యదర్శి శాంసన్ సందీప్, అనీ ఎడ్విన్, పాలిన్, జోయల్ సామ్, ఆనంద్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎన్నికల హామీలన్నీ అమలు చేయాలి

పట్లోరి రాజు

చిన్నశంకరంపేట, డిసెంబర్ 29: ఎన్నికల హామీలన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ప ట్లోరి రాజు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రె స్ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా మహాలక్ష్మీ పథకం, ఆసరా పింఛన్ 4వేలు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు ఆరోపించారు.

సర్పంచ్ ఎన్నికల్లో ఎస్టీలకు ప్రాధాన్యనివ్వాలి

ఎరుకలి నర్సింహా

మనోహరాబాద్, డిసెంబర్ 29: సర్పంచ్ ఎన్నికల్లో ఎస్టీలకు ప్రాధాన్యత కల్పించాలని రాష్ట్ర ఎస్టీల ఫోరం ఉపాధ్యక్షుడు ఎరుకలి నర్సింహా అన్నారు. ఆదివారం కాళ్లకల్ గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలో మేజర్ పంచాయతీ కాళ్లకల్‌ను ఎస్టీలకు కేటాయించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు.

గడ్డి వాము దగ్ధం

శివ్వంపేట, డిసెంబర్ 29: మండలంలోని లింగోజీగూడ తండాలో మంటలు అంటుకుని గడ్డివాము దగ్ధమైంది. బాధిత కుటుంబీకులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మాలోత్ లాల్‌సింగ్ వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తన పొలంలోని వరి గడ్డి, మిగతా పొలాల్లోని గడ్డిని మిషన్ సాయంతో మోపులు కట్టించి గడ్డివాముగా పెట్టుకున్నాడు. ఆదివారం ప్రమాదవశాత్తు గడ్డి వాముకు నిప్పంటుకున్నది. దీంతో సుమారు 500 మోపుల గడ్డి దగ్ధమైంది. సమాచారం అందుకున్న నర్సాపూర్ అగ్నిమాపక వాహనం వచ్చి మంటలు అదుపు చేసే ప్రయత్నం చేసినా గడ్డివాము అప్పటికే పూర్తిగా కాలిబూడిదైంది. దీంతో సుమారు లక్ష రూపాయల ఆస్తినష్టం వాటినట్లు బాధితులు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి నిధులు ఇవ్వండి

నర్సాపూర్, డిసెంబర్ 29: మున్సిపాలిటీలోని వెంకటేశ్వర కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి రూ.50 లక్షల నిధులివ్వాలని కాలనీ వాసులు ఎంపీ రఘునందన్‌రావుకు ఆదివారం వినతి పత్రం అందజేశారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో కాలనీవాసులు ఎంపీని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. ఎంపీని కలిసిన వారిలో కాలనీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ఆంజనేయులు, శ్రీనివాస్‌గౌడ్, శంకర్‌నాయక్, వెంకట్ గౌడ్, శ్రీనివాస్, అంజిరెడ్డి ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. 8977639662 / 8977639663.
NT-338986-All
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కార్యకర్తలందరికీ బీఆర్ఎస్ అండగా ఉంటుంది


శివ్వంపేట: నూతన కమిటీని సన్మానిస్తున్న ఎమ్మెల్యే

నర్సాపూర్‌లో చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే

ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి
- బీఆర్ఎస్ దొంతి గ్రామకమిటీ అధ్యక్షుడిగా చిగుళ్లపల్లి శ్రీనివాస్‌గుప్తా ఎన్నిక
- నర్సాపూర్ మండలం తిమ్మాపూర్‌లో 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

శివ్వంపేట, డిసెంబర్ 29: బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలందరికీ అండగా ఉంటుందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని దొంతి గ్రామంలో బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు మృతి చెందాడు. దీంతో ఖాళీగా ఉన్న కమిటీకి అధ్యక్షుడిగా చిగుళ్లపల్లి శ్రీనివాస్‌గుప్తాను మండలాధ్యక్షుడు రమణాగౌడ్ సమక్షంలో జీవన్‌దివ్య గార్డెన్‌లో ఆదివారం ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ ఉపాధ్యక్షుడిగా ఎండి లాయక్, ప్రధాన కార్యదర్శిగా కాశనబోయిన నర్సింలును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామకమిటీని సన్మానించి, మాట్లాడారు. పార్టీకోసం కష్టపడి పని చేసే కార్యకర్తలందరినీ కడుపులో పెట్టుకుని చూసుకుంటుందన్నారు. ఏ ఆపద వచ్చినా తాను అండగా ఉంటానన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై బెదిరింపు రాజకీయాలు, ప్రశ్నిస్తే కేసులు పెడుతుందని మండిపడ్డారు. ప్రజా సమస్యలపై నిత్యం బీఆర్ఎస్ ప్రజల పక్షాన నిలుస్తున్నదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షులు రమణాగౌడ్, మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, గ్రంథాలయ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, మాజీ జడ్పీ కో ఆప్షన్ సభ్యులు మ న్సూర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గొర్రె వెంకట్ రెడ్డి, రైతుసమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు నాగేశ్వరరావు, గూడూరు యాదగౌడ్, మాజీ కో ఆప్షన్ మెంబర్ లాయక్, మాజీ ఎంపీటీసీ లక్ష్మీ కుమార్, నాయకులు భిక్షపతి, కైఫ్ ఉన్నారు.

లో ఓల్టేజీ సమస్యను అధిగమించాలి

నర్సాపూర్, డిసెంబర్ 29: మండలంలో లో ఓల్టేజీ సమస్యను అధిగమించాలని ఎమ్మెల్యే సునితాలక్ష్మారెడ్డి తెలిపారు. తిరుమలాపూర్ గ్రామానికి 25 కేవీ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తిరుమలాపూర్ గ్రామస్తులు లో వోల్టేజీ కారణంగా అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, వారికి ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ డీఈతో మాట్లాడి, నూతన ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయించినట్లు తెలిపారు. చెరువు తూము మరమ్మతుతు, గైడ్‌వాల్ రిపేర్ ఎస్టిమేషన్ వేయమని అధికారులకు సూచించడం జరిగింది.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. సీఎంఆర్ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి మంజూరైన రెండు లక్షల యాభై వేల రూపాయల చెక్కులను ఎమ్మెల్యే నర్సాపూర్ క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమొద్దీన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు సత్యంగౌడ్, ప్రసాద్, వంజరి శ్రీనివాస్, కొండల్, శ్రీశైలంరెడ్డి, మహిపాల్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, సత్యనారాయణ, చంద్రాగౌడ్, రమణాగౌడ్, యాదాగౌడ్, షేక్ హుస్సేన్, సిలువేరు వీరేశం పాల్గొన్నారు.

ఏడుపాయల్లో భక్తుల సందడి

దుర్గామాతను దర్శించుకున్న మంత్రి దామోదర రాజనర్సింహ

ఏడుపాయల వనదుర్గామాత అమ్మవారి సన్నిధిలో భక్తులు

పూజలందుకుంటున్న అమ్మవారు


దుర్గామాతను దర్శించుకున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

పాపన్నపేట, డిసెంబర్ 29: ఏడుపాయల వనదుర్గామాతను రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదివారం దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి రాక సందర్భంగా వేదపండితులు ఆయనకు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఆయన వ్యక్తి గత కార్యదర్శి ఏడుపాయల్లో నిర్వహించిన విందుకు మంత్రి హాజరయ్యారు. ఆదివారం సుదూర ప్రాంతాల నుంచి భక్తుల పెద్ద సంఖ్యలో ఏడుపాయలకు చేరుకుని అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు అమ్మవారికి ఒడిబియ్యం, కుంకుమార్చనలు, తలనీలలు సమర్పించారు. ఆలయ సిబ్బంది సూర్యశ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి, నర్సింలు, వర్ణాచారి, రాజు ఏర్పాటుచేశారు. వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆలయ పునర్నిర్మాణం పనులు పరిశీలించిన స్వామి

పాపన్నపేటలోని హమామన్ ఆలయ పునర్నిర్మాణ పనులను జ్యోతిర్వాస్తు విద్యాపీఠం మహేశ్వర శర్మ సిద్ధాంతి స్వామి సందర్శించారు. హనుమాన్ ఆలయం శిథిలావ్యవస్థకు చేరడంతో పునర్నిర్మాణం చేపట్టాలాని గ్రామస్తులు నిర్ణయించి, పనులు చేపట్టారు. ఈ పనులు కొనసాగుతున్నాయి. వీటిని పరిశీలించడానికి స్వామివారు వచ్చారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు స్వామిని ఘనంగా సన్మానించి, ఆశీర్వచనం పొందారు. చీకోడ్ సొసైటీ చైర్మన్ దత్తు, కమిటీ సభ్యులు కిషన్ రెడ్డి, రాములు విఠలేశ్వర్ తదితరులు ఉన్నారు.

హోరాహోరీగా సాఫ్ట్‌బాల్ పోటీలు

మహిళా జట్ల మధ్య జరుగుతున్న పోటీలు

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 29: మెదక్‌లోని ఔటడోర్ స్టేడియం, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. ఆదివారం పలు జిల్లాల జట్ల మధ్య పోటీలు జరిగాయి. ఈ నెల 31తో పోటీలు ముగియనున్నట్లు ఇన్‌చార్జి డీఎస్‌వో నాగరాజు తెలిపారు.

హెడ్ కానిస్టేబుల్ బలవన్మరణం

భర్త ఆత్మహత్య చేసుకున్నాడని తెలిసి రోదిస్తూ పీఎస్‌కు చేరుకున్న కానిస్టేబుల్ భార్య శైలజ

సాయికుమార్ (ఫైల్)

కొల్చారం, డిసెంబర్ 29: మనస్తాపానికి గురై హెడ్ కానిస్టేబుల్ చెట్టుకు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడిన ఘటన కొల్చారం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. ఉరేసుకునే ముందు తన కూతురుతో ఫోన్‌లో మా ట్లాడుతూ తన చావే అన్ని సమస్యలకు పరిష్కారమవుతుం దంటూ ఆత్మహత్యకు పాల్పడ్డట్లు తెలిసింది. వెంటనే అతడి కూతురు ఎస్సైకి సమాచారం ఇవ్వడం, ఎస్సై విధిలో ఉన్న మరో కానిస్టేబుల్‌కు సమాచారం ఇచ్చాడు. సదరు కానిస్టేబుల్ వెళ్లి చూసే సరికి విగతజీవుడై చెట్టుకు వేళాడుతూ కనిపించాడు. కొల్చారం పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సాయికుమార్ పోలీస్‌స్టేషన్ ఆవరణలోని పాత ఎస్సై క్వార్టర్స్ ఎదుట ఉన్న చెట్టుకు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి కొల్చారం పీఎస్‌కు చేరుకుని కానిస్టేబుల్ మృతదేహానికి పంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ జిల్లా దవాఖానకు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. బలవన్మరణానికి గల కారణాలు ఇలా ఉన్నాయి. కానిస్టేబుల్ సాయికుమార్ ఆంధ్రాలోని గుంటూరు జిల్లాకు చెందినవాడు. 1992లో ఉద్యోగం పొంది మెదక్ జిల్లా నర్సాపూర్‌లో స్థిర నివాసం ఏర్పర్చుకున్నాడు. సుమారు ఆరు సంవత్సరాలుగా హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ నర్సాపూర్, కౌడిపల్లి స్టేషన్‌లలో పనిచేసి 20 నెలల క్రితం బదిలీపై కొల్చారం స్టేషన్‌కి వచ్చాడు. నర్సాపూర్‌లో పని చేస్తున్నప్పుడు స్థానికంగా టిఫిన్ సెంటర్ నడుపుకునే ఒక మహిళతో సాయికుమార్‌కు పరిచయం ఏర్పడింది. దీంతో అతడు పలుమార్లు ఆమెతో ఫోన్‌లో సంభాషించాడు. ఈ విషయం తెలిసిన సదరు మహిళ భర్త, అతడి అల్లుడితో కలిసి కానిస్టేబుల్‌ను బ్లాక్‌మెయిల్ చేశారు. తనకు డబ్బులు ఇవ్వాలని, లేకుం టే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని బెదిరింపులకు పాల్పడ్డారు. మృతుడు సాయికుమార్ వారితో రాజీకి యత్నించాడు. రాజీ కుదరకపోవడంతో విషయం బయటకు తెలిస్తే తన పరువు పోతుందని మనస్తాపంతో తనువు చాలించాలనుకున్నాడు. తాను పనిచేస్తున్న పోలీస్టేషన్‌లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్యా, వివాహం అయిన ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతుడి భార్య శైలజ ఫిర్యాదు మేర కు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

స్నేహితురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

స్నేహితురాలికి నగదు అందజేస్తున్న 10వ తరగతి స్నేహితులు

కౌడిపల్లి, డిసెంబర్ 29: మండల కేంద్రంలో 2001-02 బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థులు ఆపదలో ఉన్న తోటి స్నేహితురాలికి ఆర్థిక సాయం చేశారు. మహమ్మద్‌నగర్ గ్రామానికి చెందిన స్నేహితురాలు మల్లీశ్వరి భర్త మృతిచెందడంతో వారి కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగాలేదు. దీంతో స్నేహితులందరూ కలిసి గ్రామానికి వెళ్లి తమవంతు సాయంగా రూ.35వేల ఆర్థిక సాయాన్ని ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో దుర్గేశ్, సుధాకర్, మమత, మాణిక్యం, శేఖర్, నాగరాజు, విఠల్, దశరథ్, వడ్ల వీరేశం, ప్రతాప్, విజయ్‌కుమార్, సత్యనారాయణ, పలువురు స్థానికులు ఉన్నారు.

పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల సర్వే చేపట్టాలి

నిజాంపేట,డిసెంబర్29: ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పారదర్శకంగా చేపట్టాలని ఎంపీడీవో రాజిరెడ్డి సూచించారు. ఆదివారం మండలంలోని నగరంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఆరిఫ్ హుస్సేన్, ప్రశాంత్‌గౌడ్ ఉన్నారు.

జోరుగా ఇందిరమ్మ ఇండ్ల సర్వే

రామాయంపేట, డిసెంబర్ 29: మండలంలోని సుతారిపల్లి, డీ.ధర్మారం గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల సర్వే కొనసాగుతున్నది. ఇండ్ల వద్దకు వెళ్లి లబ్ధిదారుల నుంచి సమగ్రంగా డాటాను సేకరింస్తున్నట్లు కార్యదర్శులు మహేందర్, ప్రకాశ్ తెలిపారు.

డివైడర్‌పై అప్పుడే పుట్టిన శిశువు...

సదాశివపేట, డిసెంబర్ 29: కన్నపేగు భారమైంది. మాతృత్వం మంటగలిసింది. దీంతో పేగు బంధం తెంచుకున్న ఓ తల్లి శిశువు పుట్టిన కొంత సమయంలోనే రోడ్డులోని డివైడర్‌పై వదిలేసింది. ఈ హృదయవిదారకర ఘటన సదాశివపేట ప్రధాన రహదారిపై ఆదివారం చోటుచేసుకున్నది. సంగారెడ్డి జిల్లా సదాశివపేట ప్రధాన రహదారి మధ్యలో డివైడర్‌పై గుర్తు తెలియని వ్యక్తులు అప్పుడే పుట్టిన శిశువును వదిలి వెళ్లారు. శిశువును ఓ సంచిలో చుట్టి గ్యాస్ ఆఫీస్ దగ్గర డివైడర్‌పై వదిలేశారు. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు శిశువును దవాఖాన కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఎవరు వదిలి వెళ్లారు అనేది తెలియాల్సి ఉంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామాలను కమ్మేసిన పొగమంచు

రామాయంపేట, డిసెంబర్ 29: రామాయంపేట మండలంలోని గ్రామాలు, పట్టణాన్ని పొగమంచు కమ్మేసింది. ఆదివారం పొగమంచు మూలంగా జాతీయ రహదారిపై నడిచే వాహనాలు పొగమంచుతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు.పురపాలిక పట్టణం, రోడ్డంతా మంచు కమ్మేయడంతో వాహనదారులు తమ లారీలకు లైట్లు వేసుకుని వెళ్లారు.ఉదయం 8గంటల వరకు కూడా పొగమంచు రామాయంపేటను కప్పేసింది.